ప్రజాశక్తి
బుధవారం 9 జులై 2025 5
శ్రీ సత్యసాయి



'అనంత'లో విషాదం

వేర్వేరు ప్రమాదాల్లో రెండు రాష్ట్రాలకు చెందిన ఐదుగురు యువకులు మృతి
అప్పుల బాధ తాళలేక కౌలురైతు ఆత్మహత్య

అనంతపురం జిల్లాలో మంగళవారం వేర్వేరు చోట్ల జరిగిన ప్రమాదాల్లో ఇతర రాష్ట్రాలకు చెందిన ఐదుగురు యువకులు మృతిచెందారు. ఉరవకొండ మండలం బూదగవి గ్రామ సమీపంలో మంగళవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో కారు బోల్తాపడి మహారాష్ట్ర రాష్ట్రానికిచెందిన ముగ్గురు యువకులు మృతిచెందారు. తిరుమలకు వెళ్లి వస్తున్న సమయంలో కారు అదుపు తప్పి బోల్తాపడిన ఈ ప్రమాదంలో వీరు మృతిచెందారు. కళ్యాణదుర్గం మండలం పాపంపల్లిలోని ఓ వ్యవసాయ పొలంలో నీటి సంపులో పడి రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన ఇద్దరు వలస కూలీలు మృతిచెందారు. జీవనోపాధి నిమిత్తం కళ్యాణదుర్గం వచ్చిన వీరు మంగళవారం పనులు లేకపోవటంతో సమీప గ్రామంలోని వ్యవసాయ తోటలోకి వెళ్లి అక్కడున్న మామిడి తోటలోని కాయలు తిని చేతులు కడుక్కోవటానికి నీటి సంపులో దిగి ఈతరాక అందులో మునిగి మృతిచెందారు. విడపనకల్లు మండలం పాల్తూరుకు చెందిన కౌలు రైతు అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య చేసుకున్నాడు. మూడు సంవత్సరాలుగా మూడెకరాల పొలాన్ని కౌలుకు తీసుకుని మిరప పంట సాగు చేస్తే దిగుబడి రాక, వచ్చిన అరకొర పంటకు గిట్టుబాటు ధర లేక అప్పుల పాలయ్యాడు. పంటసాగుకు చేసిన దాదాపు రూ. 8 లక్షల అప్పును ఎలా తీర్చాలో దిక్కుతెలియక మానసిక వేదనకు గురై మంగళవారం గ్రామ సమీపంలోని ఓ చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

వివరాలు మెయిన్‌పేజీలో...

నేడు సార్వత్రిక సమ్మె



సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ ధర్మవరంలో బైక్‌ర్యాలీ నిర్వహిస్తున్న సిఐటియు నాయకులు

ఐక్య కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ప్రదర్శనలు
వామపక్ష పార్టీల మద్దతు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

దేశ వ్యాప్తంగా నేడు సార్వత్రిక సమ్మెకు ఐక్య కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. ఇందులో భాగంగా ఉమ్మడి అనంతపురం జిల్లాలోనూ సమ్మెను జయప్రదం చేయడానికి అన్ని కార్మిక సంఘాలు సమ్మెకు సిద్ధమయ్యాయి. దీనికి వామపక్ష పార్టీలు మద్దతు ప్రకటించాయి. ఈ మేరకు ఉమ్మడి అనంతపురం జిల్లా అంతటా సమ్మెలో పాల్గొనేందుకు సంఘటిత, అసంఘటిత కార్మికులు, స్కీమ్ వర్కర్లు, రైతులు, వ్యవసాయ కార్మికులు సిద్ధమయ్యారు. ఈ మేరకు బుధవారం నాడు జరిగే సమ్మెను జయప్రదం చేయడంపై ఐక్య కార్మిక సంఘాల నాయకులు కలిసి కార్యాచరణను రూపొందించారు. జిల్లాలో సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు, ఐఎన్‌టియుసి, వైఎస్ఆర్ ట్రేడ్ యూనియన్‌లు నేడు జరిగే సమ్మెలో పాల్గొననున్నాయి. దేశంలో బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ఈ సందర్భంగా ఎండగట్టనున్నారు. కార్మిక చట్టాల స్థానంలో లేబర్‌కోడ్‌లు తీసుకొచ్చి వారి హక్కులను కాలరాయడాన్ని కార్మిక సంఘాలు తప్పుబడుతున్నాయి. కార్మిక హక్కులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. అదే సందర్భంగా కనీస వేతనాలను రూ.26 వేలకు పెంచాలని డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్రంలోనూ కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన పనిగంటల పెంపు నిర్ణయాన్ని కార్మిక సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ఇప్పటి వరకున్న ఎనిమిది గంటలను పది గంటలకు పెంచుతూ ఇటీవలనే రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం చేసింది. ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని సమ్మె సందర్భంగా డిమాండ్ చేస్తున్నారు. అదే విధంగా స్కీమ్ వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. పై డిమాండ్లన్నింటితోనూపాటు రైతులు, వ్యవసాయ కూలీల సమస్యలను సమ్మెలో పెట్టడం జరిగింది. దీంతో బుధవారం నాడు జరిగే సార్వత్రిక సమ్మెలో కార్మికులతోపాటు, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులైన బ్యాంకింగ్,, పోస్టల్, టెలికం ఉద్యోగ సంఘాలు పాల్గొంటున్నాయి. పెద్దఎత్తున సమ్మెను జయప్రదం చేసేందుకు అన్ని కార్మిక సంఘాల సమయత్తమయ్యాయి.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయండి : సిఐటియు

హిందూపురం : సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు జెడ్ పి శ్రీనివాసులు, పట్టణ కన్వీనర్ రాము పిలుపు నిచ్చారు. మంగళవారం పార్టీ కార్యలయంలో విడివిడిగా సిఐటియు అనుబంధ సంఘాల నాయకులతో సమావేశాలను నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతు కార్మికులను కట్టు బానిసలుగా చేసే లేబర్ కోర్స్ ని రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26వేలుగా నిర్ణయించాలని అసంఘటన కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని కేరళ తరహాలో కళాశాలకు ప్రత్యేక బోర్డుని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. విదేశీ కంపెనీలకు కొమ్ము కాసే విధంగా కార్మిక చట్టాలు మారుస్తున్నారని, హిందుత్వం ముసుగులో ఈ హిందూ దేశాన్ని అమ్ముతున్నారని ఇటువంటి చర్యలకు వ్యతిరేకంగా బుధవారం నిర్వహించే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో రైతులు, రైతు కూలీలు, ప్రజలు, కార్మికులు అందరూ పాల్గొనిజయప్రదం చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సమ్మెలో సమ్మెలో భాగంగా పట్టణంలోని ఇందిరా పార్కు నుంచి కార్మికులతో భారీ ప్రదర్శన ఉంటుందన్నారు. ఈ ప్రదర్శనలో సిఐటియు అనుబంధ సంఘాల నాయకులు, కార్మికులు అందరు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

పుట్టపర్తి క్రైమ్ : దేశవ్యాప్తంగా బుధవారం జరగనున్న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్ వెంకటేష్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నరేంద్ర మోడీ అనుసరిస్తున్న కార్మిక కర్షక ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలన్నారు. సత్య సాయి జిల్లాలోనికార్మికులు, కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, ఆశ, అంగనవాడి వర్కర్లు, మున్సిపల్ కార్మికులు, స్కీం వర్కర్లు అందరూ ఈ సమ్మెలో పాల్గొనాలని కోరారు. కార్మికులు ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను నాలుగు కార్మిక కోడ్ లుగా విభజించి కార్మికుల పొట్ట కొట్టడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నడుం బిగించాయన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం కార్మికులు అదనంగా రెండు గంటలు పని చేసే విధానం తీసుకువచ్చిందని దానిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతనాలు 26 వేల రూపాయలు చెల్లించాలని, మహిళా కార్మికులు రాత్రి సమయాలలో ఫ్యాక్టరీలలో పని చేయాలనే జీవోను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. బుధవారం సత్యసాయి జిల్లా కేంద్రంలో గణేష్ కూడలిలో చేపట్టే కార్యక్రమంలో జిల్లాలోని కార్మిక ఉద్యోగ స్కీం వర్కర్ల సంఘాలవారు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

న్యూఢిల్లీలో వర్క్‌షాపునకు 'అనంత' కలెక్టర్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్



అనంతపురం జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ న్యూఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. జూలై 9వ తేదీన న్యూఢిల్లీలో నిర్వహించే జాతీయ డిఎంఎఫ్ వర్క్‌షాప్‌నకు అనంతపురం జిల్లా కలెక్టర్ హాజరు కానున్నారు. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం (గనులు) శాఖ ప్రభుత్వ కార్యదర్శి ప్రవీణ్ కుమార్, వైయస్సార్ కడపకలెక్టర్ డాక్టర్.శ్రీధర్ చెరుకూరి, కర్నూలుకలెక్టర్ పి.రంజిత్ బాషా, ప్రకాశంకలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా, కష్ణా కలెక్టర్ బాలాజీ డి.కె., అనంతపురం జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్‌కు జాతీయ డిఎంఎఫ్ వర్క్‌షాపులో పాల్గొనడానికి ప్రభుత్వం అనుమతిచ్చింది.ఈ మేరకు జాతీయ డిఎంఎఫ్ వర్క్‌షాప్‌నకు హాజరయ్యేందుకు జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ మంగళవారం న్యూఢిల్లీకి బయలుదేరి వెళ్లారు.

కలుషిత ఆహారం తిని 15 మందికి అస్వస్థత

ప్రజాశక్తి - ఓబుళదేవర చెరువు

మండలంలోని ఆకుతోటపల్లి గ్రామంలో ఏకాదశి సందర్భంగా సోమవారం రాత్రి జరిగిన భజన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు కలుషిత ఆహారం తిని 15 మంది అస్వస్థతకు గురయ్యారు. సోమవారం రాత్రి జరిగిన భజన అనంతరం అక్కడికి వచ్చిన భక్తులకు పాయసం వడ్డించారు. పాయసం తిన్నవారిలో 15 మంది వాంతులు విరోచనాలు, కడుపు నొప్పికి గురయ్యారు. రామలక్ష్మి, వెంకట్ నర్సమ్మ, శివమ్మ ,లక్ష్మీదేవి, సుగుణమ్మ, అశ్వత్తమ్మ, బయన్న తదితరులు తీవ్ర అస్వస్థతకు గురికావటంతో వారిని స్థానిక ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో చికిత్స నిర్వహించారు. అనంతరం వారి ఆరోగ్యం నిలకడగా ఉందని డాక్టర్లు భాను ప్రకాష్, కమల్ రోహిత్, తెలిపారు.

పరామర్శించిన ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే : కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని స్థానిక ఎమ్మెల్యే పల్లె సింధూర, మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి మంగళవారం వేర్వేరుగా పరామర్శించారు. ఓబుళదేవరచెరువు ఆసుపత్రిలో వైద్య చికిత్సలు పొందుతున్న వారిని ఎమ్మెల్యే పల్లె సింధూర పరామర్శించి వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని అక్కడున్న వైద్య అధికారి భాను ప్రకాష్ కు సూచించారు. అస్వస్థతకు గురైన వారిని పలకరించి ధైర్యంగా ఉండాలని చెప్పారు. ఏ అవసరం వచ్చిన తన దృష్టికి తీసుకురావాలని స్థానిక వైద్యాధికారికి సూచించారు. అస్వస్థకు గురైన వారి కుటుంబాలను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ జయచంద్ర, మాజీ జెడ్పిటిసి పిట్టా ఓబుల్ రెడ్డి ,టిడిపి సీనియర్ నాయకులు తుమ్మల మహబూబ్ బాషా, సామకోటి ఆదినారాయణ, అంజినప్ప ,నిజాం వలి, చాంద్ భాషా, శ్రీనివాసులు, మండోజి అరిఫ్,కంచె సురేష్ , సుధాకర్ రెడ్డి ,షాను , జౌలీ బాబా, అంజి , సోము, ఓబుల రెడ్డి , తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా మాజీ ఎమ్మెల్యే దుద్దు కుంట శ్రీధర్‌రెడ్డి స్థానిక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని అక్కడున్న వైద్య లకు సూచించారు. అస్వస్థతకు గురైన వారిని పలకరించి ధైర్యంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ లక్ష్మీరెడ్డి, ఎంపీపీ పర్వీన్ భాను, జడ్పిటిసి కుర్లి దామోదర్ రెడ్డి, షామీర్ భాష, కోళ్ల కష్ణారెడ్డి, రాజు నాయుడు, భారతి సిమెంట్ రఫీక్, సర్పంచి గోవిందు, రంగారెడ్డి, జగన్మోహన్ చౌదరి, రామసుబ్బారెడ్డి, నిసార్ అహ్మద్, చంద్రమౌళి, భాస్కర్ రెడ్డి, చెన్నారెడ్డి, బాబా తదితరులు పాల్గొన్నారు.



బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే,



బాధితులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే,

సంతేబిదనూరులో 'పొలం పిలుస్తోంది'

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం రూరల్ మండల పరిధిలోని సంతేబిదనూరు, బేవిన హళ్లి గ్రామాల్లో మంగళవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి సురేంద్ర నాయక్ ఆధ్వర్యంలో పంటల సాగుపై రైతులకు పలు సూచనలు చేశారు. ముఖ్యంగా మొక్కజొన్న సాగులో సస్య రక్షణ, ఎరువుల యాజమాన్య పద్ధతులపై వివరించారు. పంట సాగు సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు, సలహాలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది సిబ్బంది రవీంద్ర, చంద్ర శేఖర్, దిల్షాద్, రైతులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లు పరిశీలన



విలేకరులతో మాట్లాడుతున్న కలెక్టర్ చేతన్

ప్రజాశక్తి - కొత్తచెరువు

ఈనెల 10వ తేదీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, కొత్త చెరువులో జరిగే మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశానికి వస్తున్న నేపథ్యంలో వారి పర్యటనా ఏర్పాట్లను కలెక్టర్, ఎస్పీ, స్థానిక ఎమ్మెల్యే మంగళవారం పరిశీలించారు. కలెక్టర్ టిఎస్. చేతన్, ఎస్పీ రత్న, స్థానిక ఎమ్మెల్యే పల్లె సింధూర, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి తదితరులు సత్యసాయి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం సాయంకాలం విలేకరుల సమావేశాన్నినిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సత్యసాయి ప్రభుత్వ జూనియర్ కళాశాల, జిల్లా పరిషత్ బాలుర బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించే మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశంలో రాష్ట్ర ముఖ్యమంత్రి , విద్యాశాఖ మంత్రి పాల్గొననున్నారన్నారు. అందుకు తగ్గ ఏర్పాట్లను సిద్ధం చేయడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో కేవలం విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, అధికారులు మాత్రమే పాల్గొనాలని మిగిలిన వారు ఎవరు ఈ సమావేశాల్లో పాల్గొనకుండా ప్రజలు సహకరించాలని కోరారు. ఈ పర్యటనలో భాగంగా విద్యార్థులతో, వారి తల్లిదండ్రులతో సిఎం ముఖాముఖి కార్యక్రమం నిర్వహించి అనంతరం సహపంక్తి భోజనాలు చేస్తారన్నారు. ఇక్కడ జరుగుతున్న సమావేశానికి భారీగా పోలీస్ బందోబస్తు నిర్వహిస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ట్రాఫిక్ మళ్లింపులు చేపట్టినట్లు పోలీసులు చెప్పారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, ఆర్డీవోలు సువర్ణ, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

'బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ' క్యూఆర్ కోడ్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-హిందూపురం

గత సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ -6 పథకాలు ఏ ఒక్కటీ అమలు చేయలేదని నిరసన వ్యక్తం చేస్తూ వైసిపి అధిష్టానం పిలుపు మేరకు మంగళవారం 'బాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీ' గ్రూప్ అందించిన క్యూ ఆర్ కోడ్ ను నియోజకవర్గ సమన్వయకర్త దీపికా వేణు రెడ్డి ఆవిష్కరించారు. పట్టణంలోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో దీపికా తో పాటు హిందూపురం పార్లమెంట్ పార్టీ ఇన్‌ఛార్జి ^మేష్ రెడ్డి, మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధుమతి రెడ్డి తదతరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి అతి దారుణంగా రాష్ట్ర ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. రాష్ట్ర అభివద్ధిని, ప్రజల సంక్షేమాన్ని, విస్మరించి కేవలం రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్నారని విమర్శించారు. స్థానికంగా ఉండాల్సిన ఎమ్మెల్యే ఎక్కడో ఉంటూ చుట్టపు చూపుగా వస్తున్నారని, ఆయనకు కనీసం నియోజకవర్గంలో ఏమి జరుగుతుందో కూడా తెలియని పరిస్థితి నెలకొందని వాపోయారు. ఇప్పటికైనా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాల్సిన బాధ్యత ఈ కూటమి ప్రభుత్వంపై ఉందని, అని చేయని పక్షంలో ప్రజల పక్షాన, ప్రజల కోసం పోరాడుతామని తెలిపారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



క్యూఆర్ కోడ్ స్కాన్ ఆవిష్కరిస్తున్న నాయకులు

జస్టిస్ శ్రీనివాస్‌రెడ్డిపై ట్రోలింగ్ ప్రజాస్వామ్యానికి విరుద్ధం

ప్రజాశక్తి-హిందూపురం

రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీనివాస్ రెడ్డిపై ఇటీవల వివిధ సోషల్ మీడియాలలో జరుగుతున్న ట్రోలింగ్ అనవసరమైన, దురుద్దేశ పూరితమైనవిగా హిందూపురం బార్ అసోసియేషన్ ఖండించింది. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వన్నేరువప్ప, పివి రామచంద్రప్ప తదితరులు పత్రికా ప్రకటన విడుదల చేశారు. జస్టిస్ శ్రీనివాస్ రెడ్డి పై సోషల్ మీడియా ట్రోలింగ్ పరువు నష్టం కలిగించే విధంగా ఉన్నాయన్నారు. ప్రజాస్వామ్యానికి మూలస్తంభమైన న్యాయవ్యవస్థ సమగ్రతను దెబ్బతీసే విధంగా చేస్తున్న ఇటువంటి ప్రయత్నాలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. న్యాయమూర్తులు తమ రాజ్యాంగ విధులను అత్యంత బాధ్యత, నిష్పాక్షికత, అంకితభావంతో నిర్వర్తిస్తారని అన్నారు. డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లపై జరిగే ఏవైనా వ్యక్తిగత దాడులు కోర్టు ఘనతను దెబ్బతీయడమే కాకుండా, న్యాయ వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని కూడా దెబ్బతీస్తాయని పేర్కొన్నారు. న్యాయవ్యవస్థ సభ్యులపై తప్పుడు, అగౌరవకరమైన, అవమానకరమైన కంటెంట్‌ను వ్యాప్తి చేసే వారిపై తక్షణ కఠిన చర్యలు తీసుకోవాలని అసోసియేషన్ ప్రతినిధులు డిమాండ్ చేశారు.

రేషన్‌కార్డుల జారీ ఎప్పుడో..?

◆ కొత్త కార్డులు, ఇతర మార్పుల కోసం వినతుల వెల్లువ ◆ మొత్తం 69 వేల దరఖాస్తులు
◆ అత్యధికంగా పేర్లు చేర్చేందుకే.. ◆ కొత్త బియ్యం కార్డులకు 7477 మంది అర్హులుగా గుర్తింపు



ప్రజాశక్తి-హిందూపురం

రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి. కొత్త బియ్యం కార్డులు, మార్పులు, చేర్పులు, ఇతర సేవల కోసం వేలాది మంది దరఖాస్తు చేసుకుంటున్నారు. అర్హులైన పేదలకు బియ్యం కార్డులు జారీ చేసేందుకు ఆగష్టు నెల ఏడో తేదీ నుంచి ప్రభుత్వం దరఖాస్తుల ప్రక్రియను ప్రారంభించిన విషయం తెలిసిందే. కొత్త కార్డుల్లో కుటుంబ సభ్యుల చేర్పులు, ఉన్న కార్డుల్లో తొలగింపులు, చిరునామా మార్పు, కార్డు విభజన, కార్డు సరెండర్, ఆధార్ సరిచేయడం వంటి అంశాలకూ అవకాశం కల్పించడంతో సచివాలయాల్లో తమ వివరాలను నమోదు చేసుకుంటున్నారు. దరఖాస్తు దారుల నుంచి వచ్చిన వినతులను తహశీల్దార్లు పరిశీలించి అర్హులైన వారితో జాబితాలను ప్రభుత్వానికి పంపుతున్నారు.ఈ నేపథ్యంలో కొత్తకార్డుల జారీ ఎప్పుడన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, రాయితీలకు రేషన్ కార్డు తప్పనిసరి అయింది. ఇల్లు, ఇంటి స్థలం మంజూరు వంటి అంశాలకూ కార్డు అవసరమవుతోంది. ఐదేళ్లుగా కొత్తగా రేషన్ కార్డులు మంజూరు చేయలేదు. దీంతో కుటుంబ సభ్యుల చేర్పులు, తొలగింపుతో పాటు చిరునామాల మార్పు సవరణలకూ అవకాశం లేకుండా పోయింది. వీటితోపాటు కొత్తగా పెళ్లై, కుటుంబం నుంచి విడిగా ఉంటున్న వారు రేషన్‌కార్డుకు నోచుకోలేకపోయారు. ప్రభుత్వం గత నెల ఏడో తేదీ నుంచి కొత్త రేషన్ కార్డులు, ఇతర అంశాలకు వెబ్‌సైట్‌ను తెరిచింది. దీంతో అధిక సంఖ్యలో దరఖాస్తులు వస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా ఈ ప్రక్రియ సాగుతోంది. రేషన్ కార్డుల జారీ, మార్పులు, చేర్పుల కోసం ప్రభుత్వం అవకాశం కల్పించడంతో ఉద్యోగం, ఉపాధి, వ్యాపారాల కోసం ఇతర ప్రాంతాల్లో నివాసముంటున్న వారు తమ సొంత గ్రామాలకు చేరుకుని దరఖాస్తు చేసుకుంటున్నారు.పలురకాల సేవలకు జిల్లాలో ఇప్పటి వరకు 69 వేల దరఖాస్తులు వచ్చాయి. వీటిలో సభ్యుల చేరిక కోసమే అధిక సంఖ్యలో దరఖాస్తులు చేరాయి. 51.070 మంది తమ కుటుంబ సభ్యులను కార్డులో చేర్చాలని విన్నవించారు. వాటిలో కొత్త బియ్యం కార్డుల కోసం 7.477 మంది దరఖాస్తు చేసుకున్నారు. బియ్యం కార్డు విభజన కోసం 6959 దరఖాస్తులు అందాయి. కుటుంబ సభ్యుల తొలగింపు కోసం 1260 మంది దరఖాస్తు చేసుకున్నారు. బియ్యం కార్డులో చిరునామా మార్పు కోసం 1918 మంది, ఆధార్ అనుసంధానంలో దొర్లిన తప్పిదాలను సరిచేయాలంటూ 946 మంది దరఖాస్తు చేసుకున్నారు. 31 మంది రేషన్ కార్డులు స్వాధీన పరిచేందుకు సమ్మతి తెలిపారు. 5,653 మంది కొత్తగా బియ్యం కార్డులు సచివాలయాల ద్వారా వచ్చిన దరఖాస్తుల్లో అర్హత ఉన్న వాటిని పరిశీలించి అప్రూవల్ చేస్తున్నారు. మిగిలిన వాటిని తిరస్కరిస్తున్నారు. మొత్తం 69.671 దరఖాస్తులు వచ్చాయి. వచ్చిన దరఖాస్తులను విఆర్‌ఒలు పరిశీలించి తదుపరి పరిశీలన కోసం తహశీల్దార్లకు పంపుతున్నారు.

కొత్త కార్డుల జారీ ఎప్పుడో..?

జిల్లా వ్యాప్తంగా నూతనంగా రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు చేసుకున్న వారితో పాటు ఇతర మార్పుల కోసం దరఖాస్తు చేసిన వారు ప్రభుత్వం వాటిని ఎప్పుడు మంజూరు చేస్తుందా అనిఎదురు చూస్తున్నారు. కార్డుల జారీకి ప్రభుత్వం నిర్దిష్ట గడువును విధించక పోవడంతో సచివాలయాలకు దరఖాస్తులు వస్తూనే ఉన్నాయి. దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను సాగదీయడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయింది. గత సంవత్సరం కాలంగా అర్హులైన వారు రేషన్‌కు నోచుకోలేకపోయారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వచ్చే నెల నుంచి సరకులు అందేలా చూడాలని అంతా కోరుతున్నారు.

త్వరలోనే లబ్ధిదారులకు అందజేత

ఏడు రకాల సేవలను గ్రామ, వార్డు సచివాలయాల్లో పునరుద్ధరించారు. కొత్తకార్డు సభ్యుల జోడింపు, తొలగింపు, విభజన, సరెండర్, చిరునామా మార్పు, తప్పుగా నమోదైన ఆధార్ సీడింగ్ దిద్దుబాటుకు అవకాశం కల్పించారు. గత వారం నాటికి నాటికి 69,671 మంది దరఖాస్తులు చేసుకోగా, వీటిలో 51,070 దరఖాస్తులు పేర్ల చేర్పులకు వచ్చాయి. దరఖాస్తులను పరిశీలిస్తున్నామని, ఈ నెలాఖరులోగా స్మార్ట్‌కార్డులు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా పౌరసరఫరా అధికారి వంశీకృష్ణారెడ్డి తెలిపారు. పెండింగ్‌లో ఉన్న వాటిని పరిష్కరిస్తామని చెప్పారు.

ప్రజాశక్తి www.prajasakti.com

మహిళలను గౌరవించలేని పార్టీ వైసిపి

మహిళా ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు తగదు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కదిరి టౌన్

మహిళలను గౌరవించలేని పార్టీ వైసిపి అని, స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం చివరకు మహిళలను సైతం కించపరిచేలా మాట్లాడటం సిగ్గుచేటని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిపై వైసిపి నేత మాజీ ఎమ్మెల్యే ప్రసన్న కుమార్‌రెడ్డి అసభ్యకరంగా మాట్లాడాన్ని కందికుంట తీవ్రంగా ఖండించారు. పట్టణంలోని తన నివాసంలో మంగళవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఆస్తి కోసం తల్లి, చెల్లెని మోసం చేసిన నాయకుడు వైఎస్.జగన్మోహన్‌రెడ్డి అని, అలాంటి నాయకుని నాయకత్వంలో రాజకీయ ముసుగులో మూకా కొనసాగుతోందన్నారు. అధికారం కోసం బాబాయ్‌ని హత్య చేసిన చరిత్ర వైసిపి నాయకుడిది అన్నారు. వివేకా కూతురు సునీతకు అండగా ఉండి న్యాయం చేయకపోగా ఆమెపై ఆ పార్టీ నాయకులే సభ్య సమాజం అసహించుకునేలా ట్రోల్స్ చేయించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కులాలు, మతాల మధ్య చిచ్చుపెట్టి రాజకీయ లబ్ధి పొందడం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కుటుంబానికే చెల్లుతుందన్నారు. ముగ్గురు మహిళలను వంచించిన జగన్ తన రాజకీయ భవిష్యత్తుకు తనే సమాధి కట్టుకున్నారని తెలిపారు. మహిళలను వేధిస్తున్న మూకా వైసిపిలో కొనసాగుతోందని, ప్రజలు ఆ పార్టీకి కేవలం 11 సీట్లు ఇచ్చి గట్టిగా బుద్ధి చెప్పినా వారిలో మార్పు రాలేదన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట

మహిళలను కించపరిచే వ్యాఖ్యలు తగదు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కొత్తచెరువు

మహిళా ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిపై వైసిపి మాజీ ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి పేర్కొన్నారు. ఈ నెల 10వ తేదీ సిఎం చంద్రబాబు పర్యటన నేపథ్యంలో మంగళవారం ఆమె మాజీమంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డితో కలిసి ప్రాతిపదిక సమావేశంలో మాట్లాడారు. ప్రతి కుటుంబంలో మహిళలు ఉన్నారని విషయాన్ని వైసిపి ముఖ్య నేతలు దృష్టిలో పెట్టుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంత్ రెడ్డికి టిడిపి ఎమ్మెల్యేలతో పాటు రాష్ట్ర మహిళలందరూ అండగా ఉంటామని తెలిపారు. మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథరెడ్డి మాట్లాడుతూ మహిళలంటే వైసిపి నేతలకు చులకన భావం అన్నారు. జగన్ తన తల్లి, చెల్లి, బాబాయి కూతురినే ఎంతో హీనంగా మాట్లాడించారని పాటు ఇంటి నుంచి వెళ్లగొట్టిన ప్రబుద్ధుడు అన్నారు. జగన్ పాలనలో ఎంతోమంది మహిళలను, ప్రజలను అనేక రకాలుగా హింసించారని గుర్తు చేశారు. దీంతో 2024 ఎన్నికల్లో వైసిపికి, ఆ పార్టీ అధినేత జగన్‌కు తగిన శాస్తి చేశారన్నారు. ఇకనైనా జగన్, వైసిపి నాయకులు మహిళలను గౌరవించడం అలవాటు చేసుకోవాలని వారు హితవు పలికారు.



తహశీల్దార్ నటరాజ్‌కు వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు

పంచాయతీ కార్యదర్శిపై ఫిర్యాదు

ప్రజాశక్తి-చిలమత్తూరు

మండలంలోని వెంకటాపురం గ్రామంలో ప్రభుత్వానికి చెందిన చెరువు భూమిని సాగు భూమిగా పేర్కొంటూ పంచాయతీ కార్యదర్శి చేసిన గ్రామసభ తీర్మానం తీవ్ర విమర్శలకు దారితీసింది. ఇప్పటికే ఆ భూమిలో ప్రభుత్వ పాఠశాల భవన నిర్మాణాలు జరుగుతుండగా ఇలా తీర్మానం చేయడాన్ని సిపిఎం నాయకులు తీవ్రంగా ఖండించారు. దీనివల్ల పాఠశాల భవిష్యత్తుకు ప్రమాదం ఏర్పడుతోందని, విద్యార్థుల హక్కులను కాలరాసే ప్రయత్నమని అభిప్రాయపడ్డారు. కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం సిపిఎం ఆధ్వర్యంలో తహశీల్దార్ నటరాజ్‌కు వినతిపత్రం సమర్పించారు. గ్రామపంచాయతీకి సంబంధం లేని ప్రభుత్వ భూమిని వ్యక్తిగత ప్రయోజనాల కోసం ఎలా తీర్మానం చేస్తారని, సాగు భూమిగా ఇవ్వడాన్ని సిపిఎం నాయకులు ప్రశ్నించారు. ఈ తీర్మానం హైకోర్టులో రిట్‌కు ఆధారంగా మారడం ఆందోళనకరమని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాల భూమిని కాపాడేందుకు బాధ్యులపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఫిరంగి ప్రవీణ్‌కుమార్, మండల కార్యదర్శి వెంకటేష్, రామచంద్ర, సుధాకర్, నాగరాజు, రామంజి, తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షన్‌పై అవగాహన

ఓబుళదేవరచెరువు : మండలంలోని అల్లాపల్లి పంచాయతీ కార్యాలయంలో మంగళవారం సచివాలయం, అంగన్వాడీ, ఆశా, ఫీల్డ్ అసిస్టెంట్‌లకు స్వచ్ఛ సర్వేక్షన్ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. పంచాయతీ కార్యదర్శి మల్లికార్జున మాట్లాడుతూ పాఠశాలలు, అంగన్వాడీ సెంటర్లు శుభ్రంగా ఉంచాలని, మరుగుదొడ్లు వినియోగించుకోవాలన్నారు. చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా క్లాప్ మిత్ర వాహనాలకు తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసి ఇవ్వాలని, ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో ప్లాస్టిక్‌కవర్లను వాడకూడదని, సంచి బ్యాగులను ఉపయోగించాలని తెలిపారు. సమావేశంలో మండల కోఆర్డినేటర్ రమణనాయక్, సచివాలయ సిబ్బంది విజయ్‌కుమార్, జనార్ధన్, ధనలక్ష్మి, ఫీల్డ్ అసిస్టెంట్ రమణ, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

డిజైనర్ నాగరాజుకు జాతీయ అవార్డు



డిజైనర్ జూజూరు నాగరాజు

ధర్మవరం రూరల్ : న్యూఢిల్లీకి చెందిన జాతీయ హ్యాండ్లూమ్ డెవలప్మెంట్ కమిషనర్ చేనేత, డిజైన్ డెవలప్మెంట్, మార్కెటింగ్‌లో జాతీయ అవార్డులు ప్రకటించారు. ఇందులో ధర్మవరానికి చెందిన జూజూరు నాగరాజుకు డిజైన్ డెవలప్మెం ట్‌లో జాతీయ అవార్డు దక్కినట్లు ఆయన ఓ ప్రక టనలో తెలిపారు. దేశ వ్యాప్తంగా 19 అవార్డులు ప్రకటించగా ఎపికి 3 అవార్డులు వచ్చాయి. జాతీయ చేనేత దినోత్సవం (ఆగష్టు 7వ తేదీ) రోజున న్యూఢిల్లీలో ప్రధాని నరేంద్రమోడీ నుంచి నాగరాజు ఈ అవార్డును అందు కుంటారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో తొలిసారి జాతీయ అవార్డు రావడం, డిజైన్ డెవలప్మెంట్‌లో మొదటిసారి ఎపికి ఈ అవార్డు రావటంతో ధర్మవరం చేనేత కార్మికులు హర్షం వ్యక్తం చేశారు.

ఆశా పోస్టులకు ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి-పరిగి

స్థానిక పిహెచ్‌సిలో మంగళవారం వైద్యులు స్వరూపారెడ్డి, నవీన ఆశా పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. మండలంలోని ముళ్లమోతుపల్లి, గోరవనహళ్లి, శాసనకోట గ్రామాల పరిధిలో 3 ఆశా పోస్టులకు 12 మంది దరఖాస్తులు అందాయి. శాసనకోట పంచాయతీ పరిధిలో నలుగురు దరఖాస్తు చేసుకోగా, ముళ్లమోతపల్లిలో ఇద్దరు, గోరవనహళ్లి గ్రామ పరిధిలో ఆరుగురు దరఖాస్తు చేసుకున్నారు. వీరి ప్రతిభ, పదో తరగతి మార్కుల ఆధారంగా ఎంపిక చేస్తామని వారు తెలిపారు. ఇంటర్వ్యూల్లో మోదా పంచాయతీ సెక్రటరీ రమేష్, శాసనకోట సెక్రటరీ భాస్కర్‌రెడ్డి పలువురు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల సమ్మె నోటీసు

ట్రేడ్ యూనియన్ కార్మికులు బుధవారం దేశ వ్యాప్తంగా చేపడుతున్న సమ్మెకు సహాయ సహకారాలు అందించాలని ఆశా వర్కర్లు డాక్టర్ స్వరూపారెడ్డికి సమ్మె నోటీసు అందజేశారు. కార్మికుల పని వేళలు 8 గంటలు కాకుండా 12 గంటలు చేయడం సరికాదని, దీంతో తాము సమ్మెకు మద్దతు తెలుపుతున్నట్లు వారు డాక్టర్లకు తెలిపారు.



ఆశా పోస్టుకు ఇంటర్వ్యూ చేస్తున్న పిహెచ్‌సి డాక్టర్లు

ఆదాయం ఫుల్.. సౌకర్యాలు నిల్..!

రొద్దం వారపు సంతలో సమస్యల తిష్ట

ప్రజాశక్తి-రొద్దం

రొద్దంలో ప్రతి శనివారం వారపు సంత నిర్వహిస్తారు. ఈ సంత ద్వారా పంచాయతీకి మంచి ఆదాయం కూడా వస్తుంది. అయితే సంతలో కనీస వసతులు లేక వ్యాపారులు, కొనుగోలుదారులు ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. రొద్దంలో పెనుకొండ-పావగడ ప్రధాన రహదారిలో దుకాణాల మధ్యన ఉన్న ఖాళీ దారిలో ప్రతి శనివారం నిర్వహించే సంతకు ఏటా నిర్వహించే వేలం ద్వారా రూ. లక్షల ఆదాయం సమకూరుతుంది. అయితే వ్యాపారాల నిర్వహణకు షెడ్ల నిర్మాణం కానీ, వినియోగదారుల కోసం తాగునీరు, నీడ, మరుగుదొడ్లు, తదితర ఎలాంటి వసతులు లేవు. ఈ సంతకు మండలంలోని సుమారు 20 గ్రామాల నుంచి చిరు వ్యాపారులు, కొనుగోలు వస్తున్నారు. ఉన్న కొద్ది స్థలంలో వ్యాపారులు దుకాణల ముందు కూర్చొని సంత జరపడం కూడా పలువురికి సమస్యగా మారింది. ఇక వర్షం వస్తే సమస్య మరింత తీవ్రమవుతుంది. దీనికి తోడు ఇతర ప్రాంతాలకు చెందిన కొందరు వ్యాపారులు దుకాణాలకు అడ్డుగా పెట్టి కిరాణా సరుకులు విక్రయించడంతో స్థానిక దుకాణదారులు ఒకింత అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా సంతలో రద్దీ ఎక్కువగా ఉన్న సమయంలో సెల్‌ఫోన్లు చోరీకి గురవుతున్నాయి. ఇకనైనా పంచాయతీ ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి వారపు సంతలో కనీస సదుపాయాలు కల్పించాలని వ్యాపారులు, వినియోగదారులు కోరుతున్నారు.



రొద్దంలో వారపు సంత

సమ్మె జయప్రదం చేయాలని సిఐటియు బైక్ ర్యాలీ

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

వామపక్ష కార్మిక సంఘాలు బుధవారం దేశ వ్యాప్తంగా తలపెట్టిన సార్వత్రిక సమ్మెను జయ ప్రదం చేయాలని కోరుతూ మంగళవారం పట్టణంలో సిఐటియు ఆధ్వర్యంలో నాయకులు, కార్మికులు బైక్ ర్యాలీ నిర్వహించారు. సిఐటియు మండల కన్వీనర్ జెవి.రమణ, కోకన్వీనర్ టి.అయూబ్‌ఖాన్, ఎస్ ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నాగార్జున, మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు బొగ్గు నాగరాజు, ఎంబాబు మాట్లాడుతూ 4 లేబర్ కోడ్‌లు రద్దు, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ విధానం రద్దు, కార్మికుల రెగ్యులరైజేషన్, సమాన పనికి సమాన వేతనం, కనీస వేతనం, సంక్షేమ పథకాల అమలు, ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణ ఉపసంహరణ, పంటలకు గిట్టుబాటు ధర, 8 గంటల పని విధానం, కార్మిక చట్టాల కొనసాగింపు, సిపిఎస్ రద్దు, పాత పెన్షన్ విధానం అమలు, బకాయి పిఆర్సిలు విడు దల, తదితర ప్రధాన డిమాండ్ల సాధనకై సిఐటియు, ఇతర ప్రజా సంఘాలు తలపెట్టిన సమ్మెలో సంఘటిత, అసంఘటిత కార్మికులు, ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గొనాలని కోరారు. ర్యాలీ పట్టణంలోని ప్రధాన కూడళ్ల మీదుగా సాగింది. ర్యాలీలో నాయకులు ఎల్.ఆదినారాయణ, ఎస్.హైదర్ వలి, జయచంద్ర, అనిల్, లక్ష్మి ఓబులేసు, దస్తగిరి, కాటమయ్య, పెద్దన్న, చెన్నకేశవులు పాల్గొన్నారు.



అమడగూరులో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

అమడగూరు : కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ బుధవారం జరిగే దేశావ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని మండల సిఐటియు నాయకులు పిలుపునిచ్చారు. వారు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం కార్మికులను కట్టు బానిసలుగా మార్చేలా ఉన్న కార్మిక చట్టాలను రద్దు చేసి 4 లేబర్ కోడ్స్ తీసుకొచ్చిందని, వాటిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ కేశవ, కుళ్లాయప్ప, సుధాకర్, మాబాషా, మురళి, రమణ పాల్గొన్నారు.

కొత్తచెరువు : ఈ నెల 9వ తేదీ చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సిఐటియు మండల కార్యదర్శి ముత్యాలు కోరారు. ఉద్యోగ, కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయన్నారు. కార్మికుల చట్టాలను నీరుగారుస్తున్నార న్నారు. సమ్మెలో ఉద్యోగులు, కార్మికులు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

టిడిపి ఆధ్వర్యంలో 'సుపరిపాలనలో తొలి అడుగు'

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా మంగళవారం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ పట్టణంలోని సిద్దయ్యగుట్ట, సాయి నగర్ ప్రాంతాల్లో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి సుపరిపాలనకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ ఏడాదిలో కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. అలాగే ప్రభుత్వ పనితీరును, ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట నాయకులు సంధా రాఘవ, పట్టణ రూరల్ అధ్యక్షులు పరిసే సుధాకర్, మహేష్ చౌదరి, వివిధ విభాగాల నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ఎమ్మెల్యే ఆధ్వర్యంలో అమరాపురంలో..

మడకశిర : ఎమ్మెల్యే ఎంఎస్.రాజు ఆధ్వర్యంలో మంగళవారం అమరాపురంలో 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఎమ్మెల్యే రాజు ఎంపి బికె.పార్థసారథి, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామితో కలిసి ఇంటింటికీ వెళ్లి సుపరిపాలనకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ ఏడాది పాటనలో కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అమరాపురం బస్టాండ్‌లో సీసీ రోడ్డు నిర్మాణం కోసం రూ. 50 లక్షల పార్లమెంట్ నిధులు మంజూరు చేశామన్నారు. వైసిపి హయాంలో అప్పటి పాలకుల నిర్లక్ష్యం వల్ల రాష్ట్రంలో ఆర్థిక సంక్షోభం ఏర్పడిందని విమర్శించారు. వారి వెంట టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి, మండల కన్వీనర్ కృష్ణమూర్తి, నాయకులు నరసింహమూర్తి, తదితరులు ఉన్నారు.



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న పరిటాల శ్రీరామ్, టిడిపి నాయకులు

గోరంట్ల : 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా మంగళవారం టిడిపి నాయకులు పట్టణంలోని 4వ వార్డులో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి సుపరిపాలనకు సంబంధించిన కరపత్రాలను ప్రజలు పంపిణీ చేసి, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. టిడిపి మండల కన్వీనర్ బాలకృష్ణ చౌదరి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పార్టీలకు అతీతంగా ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు అజమతుల్లా, ఉత్తమ్‌రెడ్డి, నరేష్, వేణు, జయరామ్, నిమ్మల శ్రీధర్, గిరిధర్ గౌడ్, త్యాగరాజు, హరి, తదితరులు పాల్గొన్నారు.



క్షయ వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

క్షయ వ్యాధిపై నిర్లక్ష్యం వద్దు

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

క్షయ వ్యాధిపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, ఏ మాత్రం నిర్లక్ష్యం చేయరాదని డిటిపి సూపర్వైజర్ అబీద్‌బాషా సూచించారు. మండలంలోని వెంకటగారిపల్లి గ్రామంలో మంగళ వారం అబీద్‌బాషా ఆధ్వర్యంలో క్షయపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రెండు వారాలకు మించి దగ్గు ఉండడంతో పాటు గళ్ల పడడం, ఛాతిలో నొప్పి, ఉదయం, సాయంత్రం జ్వరం, బరువు తగ్గడం, ఆకలి మందగించడం, తదితర లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. క్షయ వ్యాధి ఉన్న వారికి ఉచిత వైద్యం, పౌష్టికాహారం కోసం నెలకు రూ. 6వేలు ఇస్తారన్నారు. క్షయ వ్యాధిగ్రస్తులతో సన్నిహితంగా ఉన్న వారికి సివై టిబి పరీక్షలు నిర్వహించి వ్యాధి నిర్ధారణ చేస్తారని తెలిపారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటిస్తూ ఆరోగ్యవంతమైన జీవనం సాగించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిహెచ్ఎ లక్ష్మీనారాయణమ్మ, రాజశేఖర్, ఆశా కార్యకర్తలు రామకృష్ణమ్మ, లక్ష్మీదేవి, 104 సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎంఇఒను మార్చాలని వినతి

కదిరి టౌన్ : కదిరి ఎంఇఒను బదిలీ చేయాలని కోరుతూ మంగళవారం పిఎస్ఎఫ్ఐ, ఎన్ఎస్‌యుఐ ఆధ్వర్యంలో ఆర్డీవో వివిఎస్ శర్మకు వినతిపత్రం అందజేశారు. విద్యార్థి సంఘాల నాయకులు అరుణ్, ఉపేంద్ర మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఎంఇఒ చిన్నకృష్ణ పదేళ్లుగా ఇక్కడే కొనసాగుతున్నారన్నారు. మండలంలో విద్యారంగంలో అనేక అవినీతి, అక్రమాలు జరుగుతున్నా పట్టిం చుకునే వారు లేరన్నారు. తక్షణం ఎంఇఒను వేరే ప్రాంతానికి బదిలీ చేయాలని, లేనిచో పెద్దఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో విజయ్, లోకేష్, రవి, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక ఆకర్షణగా మస్తాన్ పీరు

తలుపుల : స్థానిక కోట పీర్ల మండపం వద్ద మంగళవారం మస్తాన్ పీరును పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. కోట నుంచి పూలబజార్ మీదుగా స్థానిక పోలీస్ స్టేషన్ పక్కన ఉన్న వేప చెట్టు వరకూ ఊరేగించారు. అనంతరం పీరును తయారుచేసిన ముజావర్ మదర్ సాబ్ సమాధి వద్ద చక్కెర చదివిం పులు చేసి పురవీధుల్లో ఊరేగించారు. రాత్రికి పీరును కొలువు దీర్చి భక్తులు చక్కెర చదివింపులు చేయించారు. రాత్రి యువత తప్పెట్లు, మేళ తాళాలు, వాయిద్యాల మధ్య వేడుకలు చేసుకున్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ నరసింహుడు పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.



ప్రత్యేక అలంకరణలో మస్తాన్ పీరు

కొత్తచెరువు : కొత్తచెరువు, కొడపగానిపల్లి గ్రామాల్లో మంగళవారం మొహర్రం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఐదు రోజులుగా పీర్ల చావిడిలో పీర్లను ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పీర్లకు చక్కెర చదివించి మొక్కు తీర్చుకున్నారు. సాయంత్రం పీర్లు జలధికి తరలివెళ్లాయి. పీర్ల ఊరేగింపులో యువకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రతి ఇంటి ముందు చెట్టును పెంచాలి

ప్రజాశక్తి-మడకశిర

ప్రతి ఇంటి ముందు తప్పనిసరిగా ఓ చెట్టును పెంచాలని బిసి సాధికారిక కుంచితి వక్కలిగ రాష్ట్ర కన్వీనర్ పాండురంగప్ప సూచించారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆయన రొళ్ల మండలంలోని రత్నగిరి పంచాయతీలో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి సుపరిపాలనకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఆయన వెంట టిడిపి మండల అధ్యక్షులు ఈరన్న, నాయకులు దాసిరెడ్డి, మారుతి ప్రసాద్, రామకృష్ణ, వెంకటేష్ ఉన్నారు.

'చేనేత రంగాన్ని విస్మరించిన ప్రభుత్వం'

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

కూటమి ప్రభుత్వం చేనేత రంగాన్ని పూర్తిగా విస్మరించిందని ఎపి చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వెంకటనారాయణ, గౌరవాధ్యక్షులు వెంకటస్వామి, ఉపాధ్యక్షులు చెన్నంపల్లి శ్రీనివాసులు, విజయభాస్కర్ విమర్శించారు. పట్టణంలోని కేశవనగర్‌లో మంగళవారం చేనేత కార్మిక సంఘం నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఈ నెల 10వ తేదీ జిల్లాకు వస్తున్న సిఎం చంద్రబాబుకు జిల్లాలో చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను, ఎన్నికల ముందు కూటమి నాయకులు చేనేత కార్మికులకు ఇచ్చిన హామీలను గుర్తు చేస్తామన్నారు. చేనేత కార్మికులకు ఏటా రూ. 24 వేలు, చేతి మగ్గాలకు 200 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్, జిఎస్‌టి రద్దు, 2 సెంట్ల ఇళ్ల స్థలం, వర్క్ షెడ్ల నిర్మాణం, తదితర హామీలను కూటమి ప్రభుత్వం ఏడాదైనా నెరవేర్చలేదన్నారు. 11 రకాల రిజర్వేషన్ చట్టాన్ని పూర్తిస్థాయిలో అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వారితో పాటు సంఘం నాయకులు శ్రీనివాసులు, కేశవ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చేనేత కార్మిక సంఘం నాయకులు

పుట్టపర్తి అభివృద్ధికి వైఎస్ సహకారం మరువలేనిది

ఎపిసిసి సభ్యులు కోటా సత్యం

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా పుట్టపర్తి అభివృద్ధికి అందించిన సహకారం మరువలేమని ఎపిసిసి సభ్యుడు కోటా సత్యం పేర్కొన్నారు. వైఎస్ఆర్ జయంతి సందర్భంగా మంగళవారం ఆయన ఇడుపులపాయలోని వైఎస్ సమాధిని సందర్శించి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం పుట్టపర్తిలో విలేకరులతో మాట్లాడుతూ తనను పుడా ఛైర్మన్‌గా నియమించడమే గాక సత్యసాయిపై ఉన్న భక్తి భావంతో ఇక్కడ అభివృద్ధికి కోట్లాది రూపాయలు మంజూరు చేశారన్నారు. పుట్టపర్తిలో బైపాస్ రోడ్డు, రింగ్ రోడ్డు, ఇక్కడి నుంచి రైల్వే స్టేషన్ వరకూ 4 వరుసల రహదారులు, సాయి ఆరామం అతిథి గృహం, శిల్పారామం నిర్మాణం, అభివృద్ధికి నిధులు కేటాయించారన్నారు. అలాగే అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి ప్రజల హృదయాల్లో నిలిచిపోయారని కొనియాడారు. పాలనలో తనదైన ముద్ర వేసుకున్నారని, అలాంటి నాయకుడు మన మధ్య లేకపోవడం బాధాకరమన్నారు.



వైఎస్ఆర్ సమాధి వద్ద నివాళులు అర్పిస్తున్న కోటా సత్యం

నేరాలు ఘోరాలు

మహిళ హత్య కేసులో నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

పట్టణంలోని గీతానగర్‌లో గత నెల 29వ తేదీ జరిగిన మహిళపై దాడి, ఆపై హత్యాయత్నం కేసులో నిందితుడిని వన్ టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. ఆ విషయాలను మంగళవారం డీఎస్పీ హేమంత్‌కుమార్, సిఐ నాగేంద్రప్రసాద్ మంగళవారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. యలమకూరు రాజశేఖర్ అలియాస్ చాకలి శేఖర్ రమాదేవి వద్ద రెండేళ్ల క్రితం రూ. 10 వేలు అప్పుగా తీసుకొన్నాడు. పలుమార్లు అడిగినా తిరిగి చెల్లించకపోవడంతో రమాదేవి రాజశేఖర్‌ను నిలదీసింది. ఇది అవమానంగా భావించిన రాజశేఖర్ గత నెల 29వ తేదీ సాయంత్రం రమాదేవి ఇంటికి వెళ్లి గొడవ పడ్డాడు. ఈ క్రమంలో ఆమె నోరు మూసి తాడుతో గొంతుకి బిగించి చంపే ప్రయత్నం చేశాడు. అయితే ఎలాగోలా తప్పించుకున్న రమాదేవి ధర్మవరం, ఆ తర్వాత అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఈ నెల 4వ తేదీ మృతి చెందింది. దీంతో హత్య కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని మంగళవారం కోర్టులో హాజరు పరిచారు. ఈ కేసును ఛేదించిన వన్ టౌన్ సిఐ నాగేంద్ర ప్రసాద్, సిబ్బంది నాగంజనేయులు, శివకుమార్, రాజప్ప, షాకీర్, బయన్న, సుధీర్‌కుమార్, రాజన్నలను డీఎస్పీ అభినందించారు.

రాళ్ల దాడిలో వ్యక్తి మృతి.. ముగ్గురిపై కేసు నమోదు

ప్రజాశక్తి-గాండ్లపెంట

మండలంలోని కురుమామిడి పంచాయతీ పరిధిలోని గుట్టకింద పల్లి గ్రామానికి చెందిన రంగారెడ్డి(51)పై అదే గ్రామానికి చెందిన మనోహర్, స్వాతి, దాదప్ప రాళ్లతో దాడి చేయడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కదిరి రూరల్ సిఐ నాగేంద్ర తెలిపిన వివరాలు.. ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ మనోహర్‌ను రంగారెడ్డి ఉపాధి బిల్లులు అడిగారు. దీంతో ఆ ముగ్గురు ఆగ్రహంతో రాంగారెడ్డిపై రాళ్లతో దాడి చేయడంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ సంఘటనలో ఆ ముగ్గురిపై కేసు నమోదు చేసుసినట్లు దర్యాప్తు చేస్తున్నట్లు జమేదారు గంగాధర్, రామయ్య తెలిపారు.



మొక్క నాటి నీరు పోస్తున్న ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, అధికారులు, నాయకులు

రైతుల సంక్షేమానికి పెద్దపీట : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-నల్లమాడ

రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వం, సిఎం చంద్రబాబు ధ్యేయమని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని మూలప్పగారిపల్లికి చెందిన మహిళా రైతు సరస్వతికి ఉపాధి హామీ ద్వారా మంజూరైన మామిడి మొక్కలను మంగళవారం ఎమ్మెల్యే పంపిణీ చేశారు. అలాగే మహిళా రైతు సరస్వతికి చెందిన 2.50 ఎకరాల్లో ఎమ్మెల్యే ఎంపిడిఒ ఆజాద్, ఎపిఒ రఘునాథ్ రెడ్డితో కలిసి మొక్కలు నాటారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. రైతులకు డ్రిప్పు, స్ప్రింక్లర్లు, వ్యవసాయ పరికరాలను రాయితీతో అందజేస్తోందన్నారు. వైసిపి పాలనలో రైతుల సంక్షేమాన్ని విస్మరించారని మండిపడ్డారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ మైలే శంకర్, ఎల్ఐసి నరసింహులు, డాక్టర్ బుట్టి నాగభూషణం నాయుడు, కేశవరెడ్డి, సలాంఖాన్, గడ్డం రమణారెడ్డి, రామచంద్ర, శివప్రసాద్‌రెడ్డి, రాయుడు, వై.వనజ, మహేశ్వర్‌రెడ్డి, అశోక్‌కుమార్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు అమగొండపాలెంలో ఎమ్మెల్యే పర్యటన

పుట్టపర్తి క్రైమ్ : 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా బుధవారం ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి అమగొండపాలెం పంచాయతీలో పర్యటించనున్నట్లు టిడిపి మండల కన్వీనర్ విజయ్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే పర్యటనలో స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

పండ్ల తోటల సాగుకు ప్రభుత్వ సహకారం

ప్రజాశక్తి-కదిరి టౌన్

రాష్ట్ర ప్రభుత్వం ఉద్యాన పంటలను ప్రోత్సహిస్తూ రైతులు ఉపాధి హామీ ద్వారా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేలా సహకారం అందిస్తుందని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ తెలిపారు. రూరల్ మండలంలోని కట్లతండాలో మంగళవారం ఉపాధి హామీ, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన మొక్కలు నాటే కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని మొక్కలు నాటారు. ముత్యాలచెరువు గ్రామ పంచాయతీలోని కట్లతండా గ్రామానికి చెందిన వెంకటనాయక్‌కు చెందిన 1.4 ఎకరాలకు ఉపాధి హామీ ద్వారా మామిడి మొక్కలు మంజూరయ్యాయి. కార్యక్రమంలో డివిజినల్ అధికారి రమేష్, ఎంపీడీవో పోలప్ప పాల్గొన్నారు.



మొక్క నాటిన ఎమ్మెల్యే కందికుంట, తదితరులు

విద్యార్థినులకు సేవాగుణం అవసరం

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

విద్యార్థినులు విద్యనే కాకుండా సేవా గుణం కలిగి ఉండాలని ప్రముఖ పర్యావరణ వేత్త భాస్కర్ నాయుడు తెలిపారు. మండలంలోని జగరాజుపల్లి విజ్ఞాన్ నర్సింగ్ అకాడమీ ఇన్‌ఛార్జి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థినుల కోసం ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. విద్యార్థినులు ప్రకృతి శక్తులను వినియోగించుకొని సమాజంలో శక్తివంతంగా ఉండడం ఎలా అనే విషయాలను భాస్కర్‌నాయుడు తెలిపారు. ఎంతోమంది రోగులకు సేవ చేసే మీకు మానసికంగా, శారీరకంగా ఎంతో శక్తి అవసరమని ఆ శక్తిని తప్పక పొందాలని సూచించారు. ధ్యానం, యోగాసనాలు నేర్పించారు. అనంతరం ధ్యానం, యోగా ద్వారా 40 రోజుల్లో శక్తిని పొందుతామని ప్రమాణం చేశారు. కార్యక్రమంలో నేషనల్ హ్యూమన్ రైట్స్ కల్చర్ అండ్ నేచర్ డెవలప్మెంట్ ఆర్గనైజేషన్ స్టేట్ యూత్ ప్రెసిడెంట్ నితీష్ చౌదరి, రంగస్వామిరెడ్డి, కళాశాల సిబ్బంది నరేష్, తదితరులు పాల్గొన్నారు.



నర్సింగ్ విద్యార్థినులతో భాస్కర్‌నాయుడు, యాజమాన్యం

పేదల గుండెల్లో చెరగని ముద్ర 'వైఎస్'



ధర్మవరంలో వైఎస్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి-పెనుకొండ టౌన్

పేద ప్రజల గుండెల్లో దివంగత సిఎం డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చెరగని ముద్ర వేసుకున్నారని వైసిపి వాల్మీకి విభాగం రాష్ట్ర అధ్యక్షులు పోగాకు రామచంద్ర పేర్కొన్నారు. వైఎస్ఆర్ జయంతి సందర్భంగా మంగళవారం పట్టణంలోని మడకశిర రోడ్డులో ఉన్న వైఎస్ విగ్రహానికి ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఉషాశ్రీచరణ్ నేతృత్వంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, పట్టణ కన్వీనర్ బోయ నరసింహ, వైస్ ఛైర్మన్ సునీల్‌కుమార్, నాయకులు కొండలరాయుడు, రాజారెడ్డి, శంకర్‌రెడ్డి, మల్లిరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్ : పట్టణంలోని పిఆర్‌టి సర్కిల్‌లో ఉన్న వైఎస్ విగ్రహానికి వైసిపి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముందుగా మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి కార్యాలయం నుంచి పిఆర్‌టి సర్కిల్ వరకూ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు మాసపల్లి సాయికుమార్, జిల్లా కార్యదర్శి బుచ్చిరెడ్డిగారి ప్రభాకర్ రెడ్డి వైఎస్ సేవలను కొనియాడారు. అలాగే మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి కార్యాలయంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 31 మంది వైసిపి నాయకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో నాయకులు కోటిరెడ్డి బాలిరెడ్డి, చందమూరు నారాయణరెడ్డి, కేతా లోకేష్, గోరకాటి పురుషోత్తంరెడ్డి, అత్తార్ జిలాన్‌బాషా, పెనుజూరు నాగరాజు, చింతా ఎల్లయ్య, బ్రహ్మయ్యాచారి, మేడాపురం వెంకటేష్, చాంద్‌బాషా, అమీర్‌బాషా, బాలిరెడ్డి, నీలూరి ప్రకాష్, కత్తె పెద్దన్న, సంజీవ్ మోహన్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓబుళదేవరచెరువు : స్థానిక వైఎస్ఆర్ సర్కిల్‌లోని వైఎస్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి పంచిపెట్టారు. శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ వైఎస్ ఆరోగ్య శ్రీ నుంచి 108 వరకూ.. ఫీజు రీయింబర్స్‌మెంట్ నుంచి రైతు రుణమాఫీ వరకు.. ఎన్నో పథకాల ద్వారా ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని పేర్కొన్నారు.



చిలమత్తూరులో కేక్ కట్ చేస్తున్న వైసిపి నాయకులు

వైఎస్ఆర్ జయంతి సభల్లో వైసిపి ప్రముఖులు

కొత్తచెరువు : స్థానిక నాలుగు రోడ్ల కూడలిలోని వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి పంచిపెట్టారు. వైఎస్ పేద ప్రజలు, రైతుల సంక్షేమానికి ఎనలేని కృషి చేశారని, ఆయన సేవలు మరువలేనివని కొనియాడారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ శ్యామ్‌సుందర్‌రెడ్డి, అధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి, నాగరాజు, ఎంపిటిసి రఫీ, లోచర్ల రాజారెడ్డి, వైస్ ఎంపిపి గంగరాజు, నాయకులు సోమశేఖర్‌రెడ్డి, ఎల్లప్ప, రామాంజనేయులు, భాస్కర్, వెంకట్రాముడు, ఆంజనేయులు, పాల్గొన్నారు.

రొద్దం : స్థానిక వైఎస్ఆర్ సర్కిల్‌లోని వైఎస్ఆర్ విగ్రహానికి వైసిపి నాయకులు గజమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్‌చేసి పంచారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

నల్లచెరువు : వైసిపి మండల కన్వీనర్ మండెం రవికుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ ఆవరణలో ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి, వైఎస్ఆర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కేక్ కట్ చేసి పలువురికి పంచిపెట్టారు. కార్యక్రమంలో నాయకులు నరసింహారెడ్డి, ఆనంద్‌రెడ్డి, నాగభూషణ, నజీర్, రఫీ, పోరెడ్డి వెంకటరెడ్డి, శంకర్ రెడ్డి, సర్పంచి హైటెక్ రమణ, ఎంపిటిసి సుమియారఫీ, బొమ్మిరెడ్డిపల్లి శ్రీకంఠరెడ్డి, అక్బర్, గోవింద రెడ్డి, సూర్యశేఖర్‌రెడ్డి, సోమిరెడ్డి, బావాఖాన్, సరస్వతమ్మ, హరి, ఆదిమూర్తి, మంజునాథ్‌నాయుడు, ఖాదర్‌వలి, ఇర్ఫాన్, ఇస్మాయిల్, మన్సూర్, బాలునాయక్, లక్ష్మీపతి, శ్రీనివాసులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చిలమత్తూరు : వైసిపి మండల కన్వీనర్ రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో వైఎస్ఆర్ జయంతి ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా దీపిక వేణురెడ్డి హాజరై వైఎస్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వైఎస్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు సురేష్, సుధీర్, గిరీష్‌రెడ్డి, వెంకటరెడ్డి, మొరంపల్లి నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి అర్బన్ : మున్సిపాలిటీ పరిధిలోని బ్రాహ్మణపల్లిలో వైసిపి నాయకులు వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి సతీమణి అపర్ణ ఆధ్వర్యంలో డాక్టర్ బొగ్గు సురేష్ అధ్యక్షతన రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర వైసిపి కార్యదర్శి డిఎస్.కేశవరెడ్డి, పట్టణ కన్వీనర్ రవినాయక్, మున్సిపల్ ఛైర్మన్ తుంగ ఓబులపతి, వైస్ ఛైర్మన్ తిప్పన్న, లక్ష్మీనారాయణరెడ్డి, నాయకులు గంగాద్రి, చెరువు భాస్కర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మడకశిర : పట్టణంలోని అమరాపురం రోడ్డులో ఉన్న వైఎస్ విగ్రహానికి మడకశిర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త ఈరలక్కప్ప, జిల్లా అధికార ప్రతినిధి ఆనంద రంగారెడ్డి, నళిని రంగేగౌడ్, రవిశేఖర్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పాలు, పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈరలక్కప్ప మాట్లాడుతూ ప్రజలను మోసం చేయడానికే టిడిపి నాయకులు సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం చేపట్టారని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కార్యక్రమంలో నాయకులు నరసింహమూర్తి, తిప్పేస్వామి, మంజునాథ్, అంజలి నాగభూషణ్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తనకల్లు : వైసిపి మండల కన్వీనర్ అశోక్‌వర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక వైఎస్ విగ్రహానికి పూలమాల వేసి కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. ఆయన మాట్లాడుతూ రైతులకు ఉచిత విద్యుత్, పేద విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ కల్పించిన ఘనత వైఎస్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు అశోక్‌రెడ్డి, విజయమ్మ, దేశాయి భక్తవత్సలరెడ్డి, సంజీవరెడ్డి, బిఎస్. అబ్దుల్‌కలాం, బిఎస్.నిజాం, కార్యకర్తలు, పాల్గొన్నారు.

హిందూపురం : పట్టణంలో అందరూ ఊహించినట్లుగానే మూడు గ్రూపులుగా ఉన్న నేతలు ఎవరికివారుగా దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలను నిర్వహించారు. మాజీ ఆగ్రోస్ ఛైర్మన్ నవీన్ నిశ్చల్ టీచర్స్ కాలనీలో ఉన్న తన పార్టీ కార్యాలయం వద్ద దాదాపు 2 వేల మంది రైతులకు మొక్కజొన్న విత్తనాలను అందజేయడంతో పాటు ఆటో డ్రైవర్లకు యూనిఫామ్‌ను పంపిణీ చేశారు. అదే విధంగా నాయకులు, కార్యకర్తల సమక్షంలో కేక్ కట్ చేసి పేదలకు అన్నదానం నిర్వహించారు. నియోజకవర్గ సమన్వయకర్త దీపికా వేణు రెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని పరిగి బస్టాండ్ లో ఉన్న రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలను వేసి నివాళులు అర్పించారు. మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక ఏఆర్ హాస్పిటల్ ఎదురుగా ఉన్న మైదానంలో రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎంపిక చేసిన రైతులను సన్మానించి వ్యవసాయానికి అవసరమైన పనిముట్లు పంపిణీ చేశారు. అదే విధంగా మహిళలకు నీటి క్యాన్లు పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో మున్సిపల్ వైస్ ఛైర్మన్లు జబివుల్లా, బలరామిరెడ్డి, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



పుట్టపర్తిలో రక్తదానం చేస్తున్న వైసిపి శ్రేణులు

పంటల సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి -పెనుకొండ టౌన్

రైతులు మొక్కజొన్న పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏవో కెసి.చందన పేర్కొన్నారు. మండలంలోని కోనాపురం, ఇస్లాపురం రైతు సేవా కేంద్రాల పరిధిలో మంగళవారం వ్యవసాయ, అనుబంధ శాఖల ఆధ్వర్యంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఏవో మాట్లాడుతూ మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు నివారణ చర్యలను వివరించారు. పంటలకు బీమా చేయించడం వల్ల పంట నష్టపోతే రైతులకు పరిహారం అందుతుందని తెలిపారు. అనంతరం భూసార పరీక్ష ఫలితాల పత్రాలను రైతులకు అందజేశారు. పట్టు పరిశ్రమ శాఖ టెక్నికల్ అసిస్టెంట్ టాల్ స్వామ్ ప్రస్తుతం పట్టుపరిశ్రమ శాఖలో అమలులో ఉన్న పథకాల గురించి వివరించారు. వారి వెంట కౌన్సిలర్ గీతాహనుమంతు, పశుసంవర్ధక శాఖ, రైతు సేవా కేంద్రం సిబ్బంది,ఆయా గ్రామాల రైతులు ఉన్నారు.

లేపాక్షి : మండలంలోని మైదుగోళం, కంచిసముద్రం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏవో శ్రీలత ఖరీఫ్-2025కి సంబంధించి రైతులు ఇన్సూరెన్స్ చెల్లించే విధానం, మట్టినామునాలను అనుసరించి ఎరువుల వాడకం, సూక్ష్మ పోషకాలు, విత్తన శుద్ధి ప్రాధాన్యత, ఈ పంట నమోదు, తదితర అంశాలపై వివరించారు. సిరికల్చర్ అధికారి యాసిన్ మల్బరీ షెడ్స్, తోటల పెంపకం గురించి వివరించారు. వారి వెంట సర్పంచి రామచంద్రరెడ్డి, శ్రీరామిరెడ్డి, సచివాలయ సిబ్బం ది హరిబాబు, రైతులు ఉన్నారు.



లేపాక్షిలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న వ్యవసాయ

ధర్మవరం రూరల్ : మండలంలోని తుమ్మల గ్రామంలో దుర్గా భవానీ మండల సమాఖ్య సమావేశ హాలులో ఎడిఎ లక్ష్మానాయక్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. డివిజన్‌లో వ్యవసాయ శాఖలో అమలవుతున్న వివిధ పథకాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం గ్రామ పొలాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించి వివిధ పంటల సాగులో మెలకు వలపై అవగాహన కల్పించారు. పంటలు సాగు చేసిన రైతులందరూ తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలని సూచించారు. సమావేశంలో మండల వ్యవసాయ అధికారులు మహమ్మద్ ముస్తఫా, శేఖర్‌నాయక్, ఓబిరెడ్డి, మురళి, కవిత, మాధురి, గీతావాణి, ఏఈఒలు ఉపేంద్ర, రియాజ్, అశ్విని, వీరాంజనేయులు, శ్రీనివాసులు, షరీఫ్, స్రవంతి, ఆర్ఎస్‌కె సిబ్బంది పాల్గొన్నారు.

సోమందేపల్లి : మండలంలోని పందిపర్తి, జూలుకుంట గ్రామాల్లో ఏవో విజయభారతి ఆధ్వర్యంలో 'పొలం పిలుస్తోంది' నిర్వహించారు. వ్యవసాయ సిబ్బంది రైతులతో కలిసి మొక్కజొన్న, తదితర పంటలను పరిశీలించారు. ఏవో మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు నివారణకు మందులను సూచించారు. ఫసల్ బీమా యోజన గురించి వివరించి, వేరుశనగ, పత్తి, టమోటాతో పాటు బత్తాయి, దానిమ్మ పంటలకు ఇన్సూరెన్స్ చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎఇఒ అలేఖ్య, సచివాలయ, రైతు సేవా కేంద్రం సిబ్బంది కులశేఖర్, రోజా, ఇన్సూరెన్స్ కంపెనీ నరేంద్ర, టిఎలు జయరాం, సుబ్రహ్మణ్యం, నాయకులు నారాయణ, బికె నాగరాజు, అంజి, కిష్టప్ప, రైతులు పాల్గొన్నారు.

నల్లమాడ : మండలంలోని బడవండ్లపల్లి గ్రామ పొలాల్లో ఏవో అబ్దుల్‌హక్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది నిర్వహించారు. ఏవో రైతులకు పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. ఈ క్రాప్ బుకింగ్ చేయించుకోవాలన్నారు. ఏవో వెంట వ్యవసాయ అధికారులు, రైతులు ఉన్నారు.

ఉపాధి హామీతో ఉద్యానవనానికి ఊతం

ప్రజాశక్తి-రొద్దం

ఉపాధి హామీలో భాగంగా మండలంలోని బొక్సంపల్లి గ్రామంలో మంగళవారం రైతు వెంకటేష్ పొలంలో ఎంపిడీవో రామ్‌కుమార్, ఏపిఒ సూర్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి మనోజ్ ఆధ్వర్యంలో 801 మామిడి మొక్కలు నాటారు. ఎంపిడీవో మాట్లాడుతూ ఉద్యాన రైతులకు ఉపాధి హామీ చట్టం ఊతంగా నిలుస్తోందన్నారు. గ్రామీణ ప్రాంత రైతులను ఆదుకోవాలన్న ఉద్దేశంతో వెంకటేశు పొలంలో మామిడి మొక్కలు నాటమని, ఇంకా ఆరుగురు రైతులకు సంబంధించి 20 ఎకరాల్లో మామిడి, దానిమ్మ, అవకాడో మొక్కలు నాటే ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్ యూనియన్ అధ్యక్షుడు బాలమురళి పాల్గొన్నారు.

తాడిమర్రి : ఉపాధి హామీ కింద ఎంపిడిఒ వెంకట రంగారావు ఆధ్వర్యంలో డిప్యూటీ ఎంపిడిఒ విజయ్ శేఖర్ నాయుడు, ఎపిఒ అనిల్ కుమార్‌రెడ్డి, ఈసి సాయికృష్ణ, కూటమి నాయకులు రైతు కిష్టప్ప పొలంలో చీనీ మొక్కలు నాటారు. ఎంపిడిఒ మాట్లాడుతూ పండ్ల మొక్కల పెంపకం కోసం గుంతలు తవ్వడం, మొక్కల ఖరీదు, ఎరువులు, నీరు పెట్టి కాపాడుకున్నందుకు ప్రభుత్వం మూడేళ్ల పాటు ఆర్థిక ప్రోత్సాహం అందిస్తుందన్నారు. మండలానికి 250 ఎకరాలు లక్ష్యంగా ఇచ్చారని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రిజ్వానా, టిఎలు వెంకటేష్ట్ణ, అరుణ, ఎఫ్ఎలు గణేష్, వెంకట్రామి రెడ్డి, నాయకులు హర్షవర్ధన్, రామ్మోహన్, పక్కీరారెడ్డి, రంగయ్య, సుధాకర్‌నాయుడు, పాపానాయుడు, భాస్కర్‌గౌడ్, కుళ్లాయిరెడ్డి, రవీంద్రారెడ్డి, శంకర్ నాయుడు, మురళిగౌడ్, వినోద్ కుమార్ పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్ : గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో భాగంగా మండల వ్యాప్తంగా ప్రతి రైతు వారి వారి పొలాల్లో పండ్ల మొక్కలు పెంచాలని నియోజకవర్గం టిడిపి క్లస్టర్ ఇన్‌ఛార్జ్ మహేష్ చౌదరి సూచించారు. ఉపాధి హామీ కింద మండలంలోని చింతలపల్లి గ్రామంలో మంగళవారం డిడిఒ జనార్దన్, ఎంపిడిఒ సాయి మనోహర్, ఏపిఒ సుధాకర్, టిఏ జనార్దన్, తదితరులు మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. మహేష్ చౌదరి మాట్లాడుతూ ప్రతి రైతు పండ్ల మొక్కల పెంపకం చేపట్టి పేదరికం నుంచి బయటపడాలని, జిల్లాను హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు దోహదపడాలని కోరారు. ఐదెకరాల లోపు ఉన్న ప్రతి రైతుకు మామిడి, నేరేడు, దానిమ్మ, చీనీ, అల్లనేరేడు, తదితర పండ్ల మొక్కలు పెంచేందుకు అవకాశం ఉందని తెలిపారు. గత వైసిపి ప్రభుత్వంలో ఉపాధి హామీ ద్వారా పండ్ల మొక్కల పెంపకంలో అవినీతిని ప్రోత్సహించారని విమర్శించారు.



రొద్దం మండలంలో పొలాల్లో మొక్కలు నాటుతున్న అధికారులు